లాక్‌డౌన్‌తో గర్భిణికి అవస్థలు

- సరిహద్దు రోడ్డును తవ్వేసిన ఒడిశా అధికారులు
- డోలీ సహాయంతో దాటించిన కుటుంబసభ్యులు

ప్రజాశక్తి- కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ అమలవుతుండడంతో గర్భిణి తీవ్ర అవస్థలకు గురైంది. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. అల్లి పంచాయతీ రెల్లిగూడకు చెందిన సవర సురంగ భార్య వాణిశ్రీకి నెలలు నిండటంతో పురిటి నొప్పులు వచ్చాయి. ఆమెను తీసుకొని ఆశ వర్కరు జన్ని వజ్రం, వాలంటీరు భాస్కర్ సహాయంతో కుటుంబసభ్యులు ఆటోలో కురిగాం పిహెచ్‌సికి బయలుదేరారు. కరోనా నివారణ చర్యల్లో భాగంగా ప్రజల రాకపోకలను నిషేధిస్తూ ఒడిశా అధికారులు అల్తి-రెల్లిగూడ రహదారిని రెండు రోజుల క్రితం జెసిబితో తవ్వేశారు. అక్కడ వరకు ఆటోలో వచ్చిన వారు డోలీ సహాయంతో గర్భిణిని రోడ్డు దాటించారు. మరో ఆటోలో కురిగాం పిహెచ్‌సికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనలు మేరకు 108లో కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఐదో కాన్పులో వాణిశ్రీ మగ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు బరువు వంద గ్రాములు మాత్రమే ఉండటంతో తల్లీబిడ్డను శ్రీకాకుళం రిమ్స్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు.

పంటంతా వర్షార్పణం

- వరి, మొక్కజొన్న రైతులకు తీవ్ర నష్టం
- వేటకు వెళ్లరాదంటూ మత్సకారులకు హెచ్చరిక

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో పలుచోట్ల ఆదివారం అర్ధరాత్రి, సోమవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. వరి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలుల బీభత్సంతో విద్యుతు సరఫరాకు అంతరాయం కలిగింది. విశాఖ జిల్లాలో వడగళ్ల వాన పడింది. అల్పపీడనం తీవ్రతకు సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో మత్సకారులు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

తూర్పుగోదావరి జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు కురిసిన వర్షాలకు సుమారు 25 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. నాలుగు వేల ఎకరాల్లో వరి పనలు తడిసిపోయాయి. 50 ఎకరాల్లో అరటి తోటలు నేల కూలాయి. పలుచోట్ల పొలాల్లోని ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. వ్యవసాయాధికారులు ఆయా ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటను పరిశీలించారు. అల్పపీడన ప్రభావంతో ఉప్పాడ రక్షణ గోడ వద్ద సముద్రపు కెరటాలు ఎగిసిపడుతున్నాయి. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో వరి, మొక్కజొన్న, మామిడి, కోకో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వరి చేలు నేలకొరిగాయి. నూర్పులు పూర్తయిన చోట్ల ధాన్యం రాశులు తడిసిపోయాయి. మొగల్తూరు, ఆకివీడు, పెనుమంట్ర, యలమంచిలి, పాలకొల్లు మండలాల్లో వర్షాలు పడ్డాయి. విశాఖ జిల్లా పెదబయలు మండలంలో వడగళ్ల వర్షం కురిసింది. పెద్ద వడగళ్లు పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో లావేరు, రణస్థలం, రేగిడి, కంచిలి, శ్రీకాకుళం, భామిని, నరసన్నపేట, భామిని తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. ఈదురు గాలుల వల్ల రాజాం, శ్రీకాకుళంలో విద్యుత్తుకు అంతరాయం కలిగింది.

తూర్పుగోదావరి జిల్లా కాజులూరులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి

ప్రజాశక్తి- పొన్నూరు (గుంటూరు), రాజోలు (తూర్పుగోదావరి)

గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలో సోమవారం పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి చెందాడు. జడవల్లికి చెందిన మిక్కిలి ప్రకాశరావు (52) గడ్డి కుప్పలు వేయడానికి తోటి కూలీలతో కలిసి సోమవారం తెల్లవారుజామునే పొలానికి వెళ్లాడు. ఉదయం ఆరు గంటల సమయంలో వర్షం పడటంతో కూలీలంతా ఇళ్లకు తిరుగుముఖం పట్టారు. ప్రకాశరావు ఇంటి రాకపో వడంతో అతని భార్య పొలానికి వెళ్లింది. పొలంలో ప్రకాశరావు విగతజీవిగా పడి ఉండి ఉన్నాడు. వంటిపై కాలిన గాయాలు ఉన్నాయి. దీంతో, పిడుగుపడి మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు.

ఉరుముల శబ్దానికి బాలింత మృతి

తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలంలో ఉరుముల శబ్దానికి గుండెపోటుకు గురై మృతి చెందింది. కడలి తూర్పుపాలేనికి చెందిన కడలి నాగలక్ష్మి (28) నాలుగు నెలల బాలింత. తెల్లవారుజామున ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుముల శబ్దానికి భయపడి గుండెపోటుతో మరణించినట్లు ఆమె కుటుంబసభ్యులు తెలిపారు.

ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు, ప్రజలు

యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి : సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ

విపత్కర సమయంలో ప్రజలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ విజయవాడలో సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. భౌతిక దూరాన్ని పాటిస్తూ ప్రజలు ఇళ్ల వద్దనే డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. పేదలు, కార్మికులు నివసించే ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని నినదించారు. సెంట్రల్, పశ్చిమ, తూర్పు నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ తినటానికి తిండి లేక పేదలు పస్తు లుంటున్నారని, కావాల్సినంత ఆహార ధాన్యాల నిల్వలు గోదాముల్లో ఉన్నప్పటికీ ప్రజలకు పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. రేషన్ కార్డు లేని వారికి కూడా రేషన్ ఇస్తామని ప్రకటించినా ఆచరణ నోచుకోవడంలేదని దుయ్యబట్టారు.

కార్మికుని మృతిపై జ్యుడీషియల్ విచారణ

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

పోలీసుల దెబ్బలతో కార్మికుడు మృతి చెందిన ఘటనపై సోమవారం జ్యుడీషియల్ విచారణ జరిగింది. గుంటూరు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు మహ్మద్ గౌస్ ఈ నెల 20న మృతి చెందిన విషయం తెలిసిందే. లాక్‌డౌన్ విధుల్లో ఉన్న ఎస్ఐ లాఠీతో కొట్టడమే ఇందుకు కారణమని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. దీనిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని న్యాయవాది చిలకా చంద్రశేఖర్ స్థానిక రెండవ అదనపు జూనియర్ సివి జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో జడ్జి కె.నరేంద్ర రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టారు. మృతుని తండ్రి ఆదాం, భార్య ముంతాజ్‌లను రెండు గంటలపాటు విచారించారు. అనంతరం ఈ నెల 29కి కేసును వాయిదా వేశారు.

పేదల సేవలో మేము సైతం

వలస కూలీలు, నిరాశ్రయులకు ప్రజాసంఘాల బాసట

కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన లాక్‌డౌన్ కారణంగా అవస్థలు పడుతున్న పేదలు, వలసకూలీలు, నిరాశ్రయులకు సిపిఎం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆహారం, నిత్యావసర వస్తువులు, మాస్కులు,శానిటైజర్లను సోమవారం పంపిణీ చేశారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

అనంతపురంలో ఒకటవ డివిజన్ మహాత్మాగాంధీ కాలనీలో 1500 కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రాంతీయ రవాణా శాఖ అధికారుల సహాయంతో నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్లు అందజేశారు. కక్కలపల్లి కాలనీ వద్ద మహారాష్ట్ర వలస కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేశారు. రాయదుర్గం,కణేకల్లులలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో పేదలకు ఆహారం అందించారు. కర్నూలులో కార్మిక కర్షక భవనంలో ఏపి రజకవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో 100 మంది పేద రజక వృత్తిదారులకు నిత్యావసర సరుకులు, ఆదోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు, వారి సహాయకులకు ఆహారం, నంద్యాలలో కూరగాయలు పంపిణీ చేశారు. చిత్తూరు జిల్లాలోని మదనపల్లెలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు మాస్కులు, మజ్జిగ పంపిణీ చేశారు. కడప జిల్లా రైల్వే కోడూరులో 150 మంది పేదలకు అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ఆహారం అందించారు.

నెల్లూరు ఆరో డివిజన్‌లో రిటైర్డ్ టీచర్ వెంటేశ్వర్లు సహకారంతో పారిశుధ్య కార్మికులను నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జెవివి ఆధ్వర్యంలో 500 మంది పేదలకు ఆహారం అందించారు. వైకుంఠపురం,పెన్నాబ్రిడ్జి వద్ద, కల్లూరిపల్లి,ఆర్‌డిటి కాలనీ,అయ్యప్ప గుడిసెంటర్,డ్రైవర్స్ కాలనీ ప్రాంతాల్లో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. ఆటో కార్మికులకు, 21,22 డివిజన్లలో పేదలకు నిత్యావసర వస్తువులు అందించారు. "ప్లాటినం రెసిడెన్సీస్ "అపార్ట్‌మెంట్, ఎపి గిరిజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పోషక ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు.

కడప జిల్లా రైల్వే కోడూరులో పేదలకు భోజనం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దినారి ప్రభాకర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమణారెడ్డి పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా చీమకుర్తిలో పారిశుధ్య కార్మికులకు గ్రానైట్ విశ్రాంత కార్మికుడు బండారు పాండురంగయ్య ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు. నగరంలో సిరిఎక్స్‌ర్పో వారి ఆధ్వర్యంలో సుజాత నగర్‌లో పేదలకు నిత్యావసర సరుకులు అందించారు. పొదిలిలో సిఐటియు,జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దాతల సహాయంతో పేదలకు భోజనం అందించారు.

విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం సంగవలస పంచాయతీ పిట్టవలసలో 20కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, కూరగాయలు అందజేశారు. అనంతగిరి మండలం గరుగుబిల్లి పంచాయతీ పరిధిలోని పందిరివలస, ఈతగెడ్డ, నడిమివలస, కోర్రాడవలస, రేగానువలస, పైడిపర్తి, కొత్తపేట , గెడ్డ వలస , భీమవరం గ్రామాలకు చెందిన 250 గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులు అంద జేశారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు కూరగాయలు, 400 సబ్బులు, మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గోవిందరావు, జిల్లా అధ్యక్షులు ఆర్.సురేష్‌బాబు, అల్లు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నం పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీలో రేషన్ కార్డులు లేని పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. పాయకరావు పేటలో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వెలుగు విఒఎల సంఘం ఆధ్వర్యంలో కూరగాయలను పంపిణీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని వలసపాక లలో ఎపి మెడికల్ రిప్రజెంటేటివ్స్ అండ్ సేల్స్ యూనియన్ నాయకులు వెంకట్రావు సహకారంతో 160 మంది పేదలకు భోజనం అందించారు. అయినవిల్లిలో ఐద్వా సీనియర్ నాయకులు కుడిపూడి రాఘవమ్మ ఆధ్వర్యంలో 1000 మందికి మాస్కులు పంపిణీ చేశారు.

గుంటూరులో కంది మళ్ళ ఉత్తరమ్మ జ్ఞాపకార్థం కుమారుడు సాంబశివరావు సహకారంతో సోమవారం ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ పబ్లిక్ స్కూల్, అమరావతి సోషల్ సర్వీసెస్ కల్చరల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ట్రస్టు (యసర్ట్), ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు), గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్యామలా నగర్, స్థంబాల గరువు, అంకమ్మ నగర్, పట్టాభిపురంలలో 350 మంది పారిశుధ్య కార్మికులకు, గుజ్జన గుండ్ల సెంటర్‌లో వాటర్ ట్యాంకుల వద్ద పనిచేసే వారికి ఆహారం అందించారు. కొల్లూరులో కెవిపిఎస్ ఆధ్వర్యంలో 350 మంది వలస కూలీలకు భోజనం అందించారు.తాడేపల్లిలో 80 మంది వలసకార్మికుల కుటుంబాలకు నిత్యావసరాలు అందించారు. క్యాపిటల్‌సిటీలోని బెంగాల్ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

యుటిఎఫ్.. : విశాఖపట్నం నక్కపల్లి మండలం హెటిరో పరిశ్రమలో పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలకు చెందిన 60 మంది వలస కార్మికులకు బియ్యం, కందిపప్పు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరులో నిత్యావసరాలు పంపిణీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం, పెద్దాపురం, పిఠాపురంలో నిత్యావసర సరుకులు, కూరగాయలను పేదలకు అందించారు.

జిఓ 3 రద్దుకు కృషి చేస్తాం

ప్రజాసంఘాల నేతలతో సమావేశంలో గిరిజన ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- పాడేరు (విశాఖపట్నం)

జిఒ 3ను సుప్రీంకోర్టు కొట్టేయడంతో గిరిజనులకు కలిగే నష్టాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అరకు ఎంపి గొడ్డేటి మాధవి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ హామీ ఇచ్చారు. విశాఖ జిల్లా పాడేరులోని కాఫీ హౌస్‌లో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నేతలతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమై దీనిపై వారు చర్చించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, ఎపిటిడబ్ల్యుటియు నాయకులు పలాసి కృష్ణారావు, సిహెచ్.శ్రీనివాస పడాల్, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు కాంతారావు, జెఎసి కన్వీనర్ రామారావు దొర తదితరులు జిఒ3 అవశ్యకత, దీని రద్దు వల్ల గిరిజనుల మనుగడకు వాటిల్లే ప్రమాదం, ఈ జిఒ పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఎంపి, ఎమ్మెల్యేలకు వివరించారు. దీనిపై వారు పైవిధంగా స్పందించారు. ఈ సమావేశంలో ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి.నర్సింగరావు, గిరిజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు కె.సింహాచలం నాయుడు, కె.గంగన్న పడాల్, కె.నీలకంఠం, పూర్ణచంద్రరావు, ఆర్.సూర్యనారాయణ, పాంగి రాజారావు, కోటి జయప్రసాద్, కూడా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమావేశంలో జిఒ ప్రతులను చూపుతున్న ఎంపి, ఎమ్మెల్యేలు, సంఘాల నేతలు

మ్యూచువల్ ఫండ్స్‌కు ఆర్‌బిఐ ఉద్దీపన

రూ.50వేల కోట్ల ప్యాకేజీ

న్యూఢిల్లీ / ముంబయి : మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా భారీ ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించింది. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థ దేశంలోని ఆరు ఫండ్స్‌ను గత వారం రద్దు చేయడంతో ఈ రంగంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఎంఎఫ్‌లకు రూ.50,000 కోట్ల మేర నగదు లభ్యత కల్పించాలని ఆర్‌బిఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా సంస్థలకు రుణాల రుణంలో ఈ ఉద్దీపనలు అందించనున్నట్లు కేంద్ర బ్యాంక్ సోమవారం వెల్లడించింది. ప్రత్యేక లిక్విడిటీ పథకం ద్వారా 90 రోజుల కాలపరిమితి గల నిర్ణీత రెపో రేటుతో ఈ మద్దతును కల్పిస్తున్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ 27 నుండి ప్రారంభం కానున్న ఈ ఓపెన్ ఎండెడ్ విండో మే నెల 11వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపింది. సంబంధిత నిధులు పొందటానికి ఎంఎఫ్ కంపెనీలు తమ బిడ్లను సమర్పించవచ్చని పేర్కొంది. మ్యూచువల్ ఫండ్స్ వద్ద గల కార్పొరేట్ బాండ్లు, కమర్షియల్ పేపర్స్, డిబెంచర్లు తదితరాల హామీతో బ్యాంక్‌లు నగదును సమకూర్చడం చేపట్టవచ్చునని ఆర్‌బిఐ వివరించింది. కరోనా వైరస్, లాక్ డౌన్ ఆంక్షల నేపథ్యంలో ఎంఎఫ్‌లపై లిక్విడిటీ ఒత్తిడిని తగ్గించే ఉద్దేశ్యంతో, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపింది. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఆర్‌బిఐ తాజా నిర్ణయంతో మ్యూచువల్ ఫండ్ కంపెనీలకు భారీ ఉపశమనం లభించినట్లయ్యిందని ఆ రంగం నిపుణులు పేర్కొన్నారు.

మార్కెట్లకు మద్దతు

మ్యూచ్‌వల్ ఫండ్స్ సంస్థలకు ఆర్‌బిఐ అందించిన ఉద్దీపన మద్దతుతో బ్యాంకింగ్ సహా అసెట్ మేనేజ్‌మెంట్ షేర్లు దూసుకెళ్లడంతో సోమవారం భారత స్టాక్ మార్కెట్లు రాణించాయి. అటు ప్రారంభం నుంచి అంతర్జాతీయ సానుకూల సంకేతాల నేపథ్యంలో సూచీలు లాభాల్లో సాగాయి. ప్రధానంగా నిఫ్టీ బ్యాంకు భారీగా పుంజుకుంది. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 416 పాయింట్లు లాభపడి 31,743కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 128 పాయింట్లు రాణించి 9,282కి వద్ద ముగిసింది. నిఫ్టీలో అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.76.24 దగ్గర నమోదయ్యింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.44 శాతం, 1.37 శాతం చొప్పున లాభపడ్డాయి. సెన్సెక్స్-30లో ఎన్‌టిపిసి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎంఅండ్ఎం, భారతీ ఎయిర్‌టెల్ సూచీలు 1.13 శాతం వరకు నష్టపోగా.. మిగితా 26 సూచీలు లాభపడ్డాయి.

భవిష్యత్తులో రైతు భరోసా కేంద్రాల ద్వారా

ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు : బొత్స

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ధాన్యాన్ని, మొక్కజొన్నను రైతు భరోసా కేంద్రాల ద్వారా భవిష్యత్తులో కొనుగోలు చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ప్రజల సహకారం, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా కృషితో కరోనా నియంత్రణలో సఫలీకృతమ య్యామని అన్నారు. సోమవారం నిర్వహించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లాక్‌డౌన్ వల్ల రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. త్వరగా పాడైపోయే మామిడి, అరటి వంటి పంటలను, మద్దతు ధరకు మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. ధాన్యాన్ని, మొక్కజొన్నను నేరుగా రైతుల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. వీటిని భవిష్యత్తులో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే ఆలోచన ఉందన్నారు. కరోనా నియంత్రణ, రైతుల అవసరాలు, మార్కెట్ స్థితిగతులపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రోజూ సమీక్షిస్తు న్నారని చెప్పారు. కార్మికులకు ఇబ్బంది లేకుండా 70 శాతం పరిశ్రమలు నడిపిస్తున్నా మని, ఉపాధి హామీ ద్వారా 15 రకాల పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలు చెప్పడానికి, కరోనా సమాచారం ఇవ్వడానికి వీలుగా 08922-236947 జిల్లా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని క్వారంటైన్ కేంద్రంలో 120 మంది ఉన్నారని తెలిపారు.

మోడీ, జగన్ నిర్లక్ష్యం వల్లే కరోనా మరణాలు

మావోయిస్టు పార్టీ ఈస్ట్ విశాఖ డివిజన్ కార్యదర్శి అరుణ

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

దేశంలో, రాష్ట్రంలో కరోనా మరణాలకు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ నిర్లక్ష్యమే కారణమని సిపిఐ మావోయిస్టు పార్టీ ఈస్ట్ విశాఖ డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం నాలుగు పేజీల లేఖ విడుదల చేశారు. కరోనా నివారణలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం ప్రజల వెనుకబాటుతనాన్ని చూసి తమ చేతుల్లో ఉన్న మీడియాతో మోడీ, అమిత్ షా... పుక్కిటి పురాణాలు విన్పిస్తున్నారని ఈ ప్రకటనలో విమర్శించారు. వలస కార్మికులను ఆదుకోవడం లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో ఉంటున్న రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలపై చూపుతున్న శ్రద్ధ, కరోనా నివారణపై చూపడంలేదని విమర్శించారు. కరోనాపై నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజల ప్రాణాలను ప్రభుత్వం బలి తీసుకుంటోందని ధ్వజమెత్తారు. కోట్లలో మాస్కులు, లక్షల్లో టెస్టింగ్ కిట్లు కొన్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు... గిరిజన ప్రాంతాల్లో ఇప్పటి వరకు కరోనా నివారణ చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను గట్టెక్కించడానికి కాల్పుల విరమణ ప్రకటించినా ప్రభుత్వం స్పందించలేదు సరికదా, సివిల్ డ్రెస్‌లో పోలీసులు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి చెందిన విశాఖ నగరంలో కేసులు పెరుగుతుంటే, ఏజెన్సీలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పాతిపెట్టిన మృతదేహం నుండి నమూనా సేకరణ

ప్రజాశక్తి- నందిగామ, చందర్లపాడు

పాతిపెట్టిన మృతదేహానికి కరోనా పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించారు. ఈఘటన కృష్ణా జిల్లా చందర్లపాడు మండలంలో చోటుచేసుకుంది. తుర్లపాడు గ్రామానికి చెందిన లారీ క్లీనర్ ఆదివారం ఉదయం మహారాష్ట్రలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. అక్కడి నుంచి ఓ ప్రత్యేక లారీలో ఆది వారం రాత్రికి మృతదేహాన్ని స్వగ్రామానికి రహస్యంగా తరలించారు. మృతదేహాన్ని పాతి పెట్టారు. ఈ విషయం సోమవారం వెలుగులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ల గ్రామం రెడ్‌జోన్ పరిధిలో ఉంది. ఆ గ్రామం దాటి తుర్లపాడు గ్రామానికి చేరుకోవాల్సివుంది. అయినా అందరి కళ్లు గప్పి ఎలా లారీ గ్రామానికి చేరిందన్నది ఇప్పుడు పెద్దచర్చనీ యాంశంగా మారింది. తుర్లపాడు గ్రామ శ్మశానవాటికలో పాతిపెట్టిన మృత దేహాన్ని సోమవారం బయటికి తీసి కరోనా పరీక్షల నిమిత్తం నమూనాలు సేకరించారు.

భయం వద్దు

(మొదటిపేజీ తరువాయి)

ట్రూనాట్ ల్యాబులు ఉన్నాయని రోజుకు 5500 మందికి పరీక్షలు చేసేస్థాయికి చేరుకున్నామని తెలిపారు. త్వరలోనే గ్రీన్‌జోన్ ఉన్న మండలాల్లో ప్రజారవాణాతోపాటు, ప్రైవేటు రవాణాకు అనుమతిచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అయితే గ్రీన్‌జోన్లలోకి కరోనా రాకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రస్థాయి కోవిడ్ ఆస్పత్రులతోపాటు, జిల్లాస్థాయిలోనూ పడకలు ఏర్పాటు చేశామని వివరించారు. 45 వేల బెడ్ల సదుపాయం ఉందని తెలిపారు. వీటిల్లో 25 వేల బెడ్లు సింగిల్ రూములుగానే ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని ఆస్పత్రుల్లో వైద్యులకు అవసరమైన పిపిఇ కిట్లు, ఎన్-95 మాస్కులు సిద్ధం చేశామని వివరించారు. మే 15వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సుల పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు.

29 ఏళ్లలోనే అత్యల్ప వృద్ధి రేటు

- ఈ ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చు
- జూన్ త్రైమాసికంలో -2.1 శాతానికి క్షీణత
- ఇండియా రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు 29 ఏళ్ల కనిష్టానికి పడిపోనుందని ఇండియా రేటింగ్స్ విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 1.9 శాతానికి దిగజారొచ్చని అంచనా వేసింది. ఇంతక్రితం 1991-92లో అత్యల్ప వృద్ధి రేటు 1.1 శాతం నమోదయ్యిందని గుర్తు చేసింది. ఆ తర్వాత అత్యంత పేలవ వృద్ధి రేటు ఈ ఏడాది చోటు చేసుకోనుందని తెలిపింది. కాగా 2020-21లో 3.6 శాతం వృద్ధి ఉండొచ్చని మార్చి 30న ఇండియా రేటింగ్స్ అంచనా వేసింది. కరోనా వైరస్ విజృంభనతో దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్‌ను విధిండచంతో జిడిపి అంచనాలకు అమాంతం కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగియనున్న త్రైమాసికంలో భారత వృద్ధి రేటు ఏకంగా మైనస్ 2.1 శాతానికి పడిపోనుందని తెలిపింది. 1951-52 తర్వాత ఇదే అత్యల్ప వృద్ధి రేటు అని విశ్లేషించింది. 2019-20 చివరి త్రైమాసికం నాటి వృద్ధి రేటు తిరిగి 2020-21 డిసెంబర్ త్రైమాసికంలో నమోదయ్యే అవకాశాలున్నాయని అంచనా వేసింది. దేశంలో జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఆర్థిక కార్యకలాపాలు తిరిగి సాధారణ స్థితికి రావొచ్చని తెలిపింది. గత 41 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా జూన్ త్రైమాసికంలో వృద్ధి రేటు మైనస్ 2.1 శాతానికి క్షీణించవచ్చని విశ్లేషించింది.

లాక్‌డౌన్ ఎత్తివేతను బట్టి కార్మికులు తిరిగి పనిలోకి రావడం, ఆర్థిక వ్యవస్థ సాధారణ స్థితికి చేరడం కాలాన్ని బట్టి ఆర్థిక గణంకాలు ఆధారపడి ఉంటాయని తెలిపింది. పాక్షిక లాక్‌డౌన్ మే మధ్య నాటికి కొనసాగవచ్చన్న సంకేతాలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 1.9 శాతానికి తగ్గొచ్చని అంచనా వేసినట్లు తెలిపింది. భారత్‌లో అత్యల్పంగా 1957-58లో మైనస్ 0.4 శాతం, 1965-66లో 2.6 శాతం, 1966-67లో 0.1 శాతం, 1972-73లో 0.6 శాతం, 1979-89లో 5.2 శాతం చొప్పున అత్యల్ప వృద్ధి రేటు చోటు చేసుకుంది. మళ్లీ రికార్డు స్థాయిలో ఈ ఏడాది పడిపోనుందని ఇండియా రేటింగ్స్ పేర్కొంది.

నాట్కో కొతూర్ ప్లాంట్‌కు యుఎస్ఎఫ్‌డిఎ అనుమతి

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మాకు చెందిన తెలంగాణలోని కొతూర్ గ్రామంలోని ప్లాంట్‌లో యుఎస్ఎఫ్‌డిఎ తనిఖీలు నిర్వహించినట్లు ఆ కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. మార్చి 2 నుంచి 6 తేదిల్లో తనిఖీలు చేయగా.. విజయవంతంగా యుఎస్ఎఫ్‌డిఎ నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్స్పెక్షన్ రిపోర్ట్ (ఇఐఆర్)ను పొందినట్లు పేర్కొంది. ఈ ప్రకటనతో సోమవారం బిఎస్ఇలో నాట్కో ఫార్మా షేర్ విలువ 0.94 శాతం పెరిగి రూ.630.20 వద్ద ముగిసింది. ఈ కంపెనీ దేశ వ్యాప్తంగా ఏడు తయారీ ప్లాంట్లు, ఆర్‌అండ్‌డి సెంటర్లను కలిగి ఉంది.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence
Registered Office: Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam - 531 021, Andhra Pradesh, India.
Corporate Office: 2nd Floor, Serene Chambers, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034, Telangana, India.
Contact Numbers: Tel: +91 40 3980 4333; Fax: +91 40 3980 4320
E-mail: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com
Corporate Identity Number: L24239AP2005PLC047518

NOTICE

NOTICE is hereby given pursuant to Regulation 29 of SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015, we hereby inform you that a meeting of the Board of Directors of the Company will be held on Thursday, April 30, 2020, inter-alia, to consider and approve the Audited Financial Results of the Company for the Financial Year ended March 31, 2020 and to recommend final Dividend, if any, on Equity Shares for the year ended March 31, 2020.
Further, the notice is also available on the website of the Company at www.lauruslabs.com.

By Order of the Board
For **Laurus Labs Limited**
Sd/- **G.Venkateswar Reddy**
Company Secretary

Place: Hyderabad
Date: April 24, 2020

epaper.prajasakti.com